మార్కెట్‌కు దీపావళి శోభ

- పట్టణంలో బాణసంచా స్టాళ్ల ఏర్పాటు
- కొనుగోలుదారులతో కళకళ


కె.కోటపాడులో అయ్యన్న విద్యా సంస్థలలో దిపావళి వేడుకలు


హరిత దీపావళి వేడుకల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు


బాణసంచా దుకాణాల వద్ద సందడి

నర్సీపట్నం: పల్లెలు, పట్టణాల్లో దీపావళి సందడి మొదలైంది. ఈ వేడుక కోసం పిల్లలు, పెద్దలు సమాయత్తమవుతున్నారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా, చీకటిని పారదోలుతూ వెలుగులు నింపే వేడుకగా దీపావళి జరుపుకొంటాం. ఆశ్వీయుజ మాస అమావాస్య రోజున వచ్చే ఈ పండగకు ఎంతో విశిష్టత ఉంది. దీపావళి రోజు ఏ ఇంటి ముందు దీపాలు సమృద్ధిగా వెలుగుతాయో ఆ ఇంట శ్రీమహాలక్ష్మి ప్రవేశిస్తుందని పెద్దలు చెబుతుంటారు. అందుకే దీపావళి రోజు సాయంత్రం మహిళలు ఇంటి నిండా దీపాలు వెలిగించి మహాలక్ష్మికి పూజ చేసి స్వాగతం పలుకుతారు.

అనాది ఆచారం మట్టి ప్రమిదలే..

మట్టి ప్రమిదల్లో ఒత్తులు, నూనె వేసి దీపాలు వెలిగించడం మన సంప్రదాయం. సాదా ప్రమిదలతో పాటు వివిధ ఆకృతుల్లో ఇప్పుడు ప్రమిదలు లభిస్తున్నాయి. నక్షత్ర దీపాలు, పంచముఖ దీపాలు, దీప స్తంభాలు, ఆకాశ దీపాలు, చిమ్నీ దీపాలు, పింగాణీ దీపాలు ఇలా పలు రకాల మోడల్స్‌లో దీప ప్రమిదలు మార్కెట్‌లో దొరుకుతున్నాయి.

బాణసంచా స్టాళ్ల కళకళ

పట్టణంలో బాణసంచా స్టాళ్లు, పలు దుకాణాలు కొనుగోలుదారులతో కళకళాడుతున్నాయి. అధికారుల అనుమతితో పెద్ద చెరువు ప్రాంతంలో 40 బాణసంచా దుకాణాలు వెలిశాయి. చిచ్చుబుడ్డులు, మతాబులు, టపాసులు కొనేందుకు వచ్చిన వారితో పెద్ద చెరువు ప్రాంతం దీపావళి పండగకు ఒక రోజు ముందు నుంచే కళసంతరించుకుంది. పిల్లా, పాపలతో వచ్చి మందుగుండు సామగ్రిని కొనుగోలు చేస్తున్నారు. వెలుగుజిలుగులు జిమ్మే బాణసంచా కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. దీపావళికి ముందే పట్టణంలో టపాసులు పేలుతున్నాయి.

ముందస్తుగా దీపావళి వేడుకలు

కె.కోటపాడు: మండల కేంద్రం కె.కోటపాడులోని అయ్యన్న విద్యా సంస్థల ఆవరణలో శనివారం ముందస్తు దీపావళి వేడుకలు నిర్వహించారు. సంస్థ అధినేత డాక్టర్ ఖాసిం, నూర్జహాన్ సారథ్యంలో విద్యార్థులు బాణసంచా కాల్చి సందడి చేశారు.


విక్రయాలకు సిద్ధం చేసిన బాణసంచా

టపాసులకు దూరంగా ఉండాలి

మాకవరపాలెం: కాలుష్యాన్ని వెదజల్లే టపాసులకు దూరంగా ఉండాలని తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం భీమారావు, ఉపాధ్యాయుడు రాము కోరారు. పాఠశాలలో శనివారం ముందస్తు వేడుకల్లో భాగంగా హరిత దీపావళి నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రంగురంగుల రంగవల్లులు వేసి దీపాలు వెలిగించారు. అనంతరం హరిత దీపావళి ఆవశ్యకతను వివరించారు. దీపావళి రోజున ఎక్కువ పొగతో కాలుష్యాన్ని వెదజల్లే టపాసులకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లోవరాజు, సుధా మాధవి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

‘సాక్షి’పై కక్ష సాధింపు చర్యలు తగదు


చోడవరం తహసీల్దారు రామారావుకు వినతి పత్రం అందజేస్తున్న మీడియా ప్రతినిధులు


కె.కోటపాడులో తహసీల్దార్ బుజంగరావుకు వినతిపత్రం అందిస్తున్న విలేకరులు

కె.కోటపాడు : ప్రభుత్వం చేస్తున్న తప్పులను ప్రజల గొంతుగా వెలుగులోకి తీసుకువస్తున్న సాక్షి మీడియాపై రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు ఉపక్రమించడం తగదని ఏపీయూడబ్ల్యూజే చోడవరం ప్రెస్‌క్లబ్ మాజీ కార్యవర్గ సభ్యుడు ఎస్.జె.వి.సత్యనారాయణ(సతీష్) అన్నారు. సాక్షి ఎడిటర్ ధనంజయరెడ్డికి పోలీసులతో నోటీసులు జారీ చేయడాన్ని నిరసిస్తూ శనివారం కె.కోటపాడులో ఆందోళన చేశారు. అనంతరం తహసీల్దార్ బుజంగరావుకు ఏపీయూడబ్ల్యూజే తరపున వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వం ద్వారా మరింత మంచి జరగాలన్న లక్ష్యంతో ప్రభుత్వం చేస్తున్న తప్పులను వెలుగులోకి తెస్తున్నందుకు సాక్షిపై ఇటువంటి దుశ్చర్యలకు ప్రభుత్వం పాల్పడుతోందని మండిపడ్డారు. ఇటువంటి చర్యలు పత్రికా స్వేచ్ఛకు విఘాతం కలిగించడమేనన్నారు. ఈ కార్యక్రమంలో విలేకర్లు నీలి శ్రీనివాసరావు, సూరిశెట్టి నారాయణ, శరగడం పరమేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లి: ప్రజా సమస్యలను, ప్రభుత్వ లోపాలను ఎత్తి చూపుతున్న సాక్షి దినపత్రికపై కక్షసాధింపు చర్యలు సరికాదని దేవరాపల్లి మండల ప్రెస్ క్లబ్ సభ్యులు డిమాండ్ చేశారు. సాక్షిపై దాడులను నిరసిస్తూ ఏపీడబ్ల్యూజే ఆధ్వర్యంలో జర్నలిస్టులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట శనివారం నిరసన చేపట్టారు. సాక్షిపై దాడులు మానుకోవాలని, మీడియా స్వేచ్ఛను కాపాడాలంటూ నినాదాలు చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ కె.అప్పారావుకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీనియర్ పాత్రికేయుడు కాటపల్లి అప్పారావు మాట్లాడుతూ కల్తీ మద్యంపై వాస్తవ కథనాలను ప్రచురించిన సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనంజయరెడ్డి, సిబ్బందిని విచారణ పేరుతో వేధింపులకు గురిచేయడం అత్యంత దారుణమన్నారు. అక్రమంగా కేసులు నమోదు చేసి విచారణకు రావాలని పోలీసులు నోటీసులు జారీ చేయడం అన్యాయమన్నారు. ప్రభుత్వంపై వ్యతిరేక వార్తలు రాసినంత మాత్రాన పత్రికా సంపాదకులు, విలేకర్లపై ప్రభుత్వం కక్ష పూరిత చర్యలకు పూనుకోవడం ప్రజాస్వామ్యంపై దాడిగా అభివర్ణించారు. ప్రశ్నించే గొంతును నొక్కే ప్రయత్నాలను విరమించుకోవాలని ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక రిపోర్టర్లు పి.గణేష్, బీవీఎస్ ప్రసాద్, పి.నాగభూషణం, గెద్దం నగేష్, తదితరులు పాల్గొన్నారు.

చోడవరం: సాక్షి మీడియా సంస్థపై రాష్ట్ర ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడడంపై జర్నలిస్టు సంఘాలు భగ్గుమన్నాయి. ఈ మేరకు చోడవరంలో ఏపీయూడబ్ల్యూజే, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సంఘాల సంయుక్తంగా శనివారం నిరసన వ్యక్తం చేశాయి. అనంతరం తహసీల్దారు రామారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె.భాస్కర రావు మాట్లాడుతూ మీడియాపై దాడులను ప్రతి ఒక్క ప్రజాస్వామ్యవాది ఖండించాలన్నారు. ఈ కార్యక్రమంలో చోడవరం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు డీవీఎం నాయుడు, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు అధికారి జగదీశ్, చోడవరం ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు వేగి మహాలక్ష్మినాయుడు, ఎస్.రాజ్‌గోపాల్, కె.సతీష్, కళ్యాణ్, నాయుడు పాల్గొన్నారు.


దేవరాపల్లిలో డీటీ అప్పారావుకు వినతి పత్రం అందజేస్తున్న పాత్రికేయులు

రోడ్లకు ఇరువైపులా 2,400 మొక్కల పెంపకం

కె.కోటపాడు : సోషల్ ఫారెస్ట్ ఆధ్వర్యంలో మండలంలో మూడు ఆర్‌అండ్‌బీ రోడ్లకు ఇరువైపులా మొక్కలను నాటి పెంచే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వన సేవకుడు చిరికి గోవింద తెలిపారు. సోషల్ ఫారెస్ట్ డీఎఫ్‌వో సోమసుందరం ఆదేశాల మేరకు శనివారం నుంచి ఈ మొక్కలను నాటే కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. కె.జె.పురం వాటర్‌షెడ్ నుంచి గవరపాలెం, నెమలిబంద చెరువు వరకు 2 కిలోమీటర్ల మార్గంలో 800 మొక్కలు, భూమిరెడ్డిపాలెం పాత చెరువు నుంచి నెమలిబంద చెరువు వరకూ గల 2 కిలోమీటర్ల మార్గంలో 800 మొక్కలు, పిండ్రంగి వెళ్లే రోడ్డు నుంచి గవరపాలెం పాత చెరువు వరకూ 2 కిలోమీటర్ల మార్గంలో 800 మొక్కలను రోడ్లకు ఇరువైపులా నాటినట్లు గోవింద తెలిపారు. ఏగిస, కానుగ, మల్బరీ, వేప, తెల్లమద్ది మొక్కలను నాటుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సోషల్ ఫారెస్ట్ రేంజ్ అధికారి చంద్రశేఖర్, డీఆర్‌వో నూకరాజు పాల్గొన్నారు.


గవరపాలెం-పిండ్రంగి మార్గంలో మొక్కలకు రక్షణ చర్యలు చేపడుతున్న ఉపాధి కూలీలు

గడియారం వితరణ

నర్సీపట్నం: డాన్ బాస్కో కాలేజీలో డిగ్రీ పూర్తి చేసి, గ్రంథాలయంలో చదువుకున్న జయరాజ్ ప్రైవేటు సంస్థలో అకౌంటెంట్‌గా కొలువు సాధించారు. తన మొదటి జీతం అందుకుని రూ.వెయ్యి విలువ గల గడియారంను శనివారం గ్రంథాలయం అధికారి దమయంతికి అందజేశారు.

ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలు అడ్డుకోవాలి

బుచ్చెయ్యపేట: మండలంలో పోలేపల్లి గ్రామంలో ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలు అడ్డుకోవాలని గ్రామ సర్పంచ్ సీతా బుజ్జి డిమాండ్ చేశారు. గ్రామస్తులతో కలిసి ఆయన శనివారం సాయంత్రం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. సర్వే నంబరు 156లో సుమారు 216 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉందని, కొందరు కూటమి నాయకులు బరితెగించి, భూముల ఆక్రమణకు తెగబడుతున్నారని ఆరోపించారు. గ్రామాన్ని ఆనుకుని ఉన్న కొండను పప్పుబెల్లాలు మాదిరిగా పంచుకుని కబ్జా చేస్తున్నారని దుయ్యబట్టారు. ఈ భూముల్లో యూకలిప్టస్ తోటల పెంపకం చేపడుతున్నారన్నారు. భూముల ఆక్రమణపై రెవెన్యూ సిబ్బందికి తెలియజేసినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. వెంటనే ఆక్రమణలు అడ్డుకోకపోతే జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేస్తామని ఆయన హెచ్చరించారు.


మాట్లాడుతున్న పోలేపల్లి సర్పంచ్ సీతా బుజ్జి తదితర్లు

ముగిసిన మండల స్థాయి క్రీడా పోటీలు


పెదబొడ్డేపల్లి గురుకులంలో ఖోఖో ఆడుతున్న బాలికలు


అథ్లెటిక్స్ పోటీలను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎంఈవో ప్రసాద్, హెచ్‌ఎం పద్మావతి


కబడ్డీలో విజేతగా నిలిచిన జె.నాయుడుపాలెం టీంతో హెచ్‌ఎం శేషగిరిరావు

కె.కోటపాడు : స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కె.కోటపాడు హైస్కూల్‌లో గత రెండు రోజుల నుంచి జరుగుతున్న క్రీడా పోటీలు శనివారం ముగిశాయి. రెండో రోజు బాలురకు అండర్-14, 17 విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఎంఈవో డీవీడీ ప్రసాద్, హెచ్‌ఎం పద్మావతి జెండా ఊపి ప్రారంభించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రోబాల్, బేస్ బాల్, యోగా, అథ్లెటిక్స్ పోటీల్లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభతో అందర్నీ ఆకట్టుకున్నారు. మండల స్థాయిలో జరిగిన ఈ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు అనకాపల్లి డివిజన్ స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఎంఈవో తెలిపారు.

నర్సీపట్నం: పెదబొడ్డేపల్లి ఏపీ రెసిడెన్షియల్ స్కూల్‌లో శనివారం ఆటల పోటీలు నిర్వహించారు. 26 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి విద్యార్థులు ఈ పోటీలకు హాజరయ్యారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్ పోటీలు జరిగాయి. విజేతలను డివిజన్ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని, డివిజన్ స్థాయి పోటీలు ఈ నెల 22న జరుగుతాయని పీడీ శ్రీనివాస్ నాయుడు తెలిపారు.

రోలుగుంట: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రారంభమైన క్రీడోత్సవాలు శనివారం ముగిశాయి. మండలంలోని ఎనిమిది జెడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థులు ఖోఖో, కబడ్డీ, షటిల్ కాక్, తదితర పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చూపారు. బుచ్చింపేట, కొమరవోలు పాఠశాలల మధ్య షటిల్ పోటీలు హోరాహోరీగా సాగగా బుచ్చింపేట టీం విజయం సాధించింది. జె.నాయుడుపాలెం టీం కబడ్డీలో విన్నర్స్‌గా నిలిచింది.

చీడికాడ: జేబీ పురం ఉన్నత పాఠశాలలో మొదటి రోజు బాలురకు, శనివారం బాలికలకు వివిధ క్రీడలు నిర్వహించినట్టు ఎంఈవో బొంజుబాబు తెలిపారు. హెచ్‌ఎం వరహామూర్తి, సర్పంచ్ చిన్నమ్మలు, వైస్ ఎంపీపీలు ధర్మిశెట్టి స్వాతి, కొండబాబు పాల్గొన్నారు.

దేవరాపల్లి: దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన మండల స్థాయి పోటీల్లో బాలురు 134, బాలికలు 134 మంది సత్తా చాటి జిల్లా పోటీలకు ఎంపికయ్యారని, ఈ నెల 21, 22, 23 తేదీలలో అనకాపల్లిలో జరిగే జిల్లా స్థాయి పోటీలలో పాల్గొంటారని ఎంఈవోలు సిహెచ్.ఉమ, వి.ఉషారాణి తెలిపారు.


జేబీ పురంలో ఖోఖో ఆడుతున్న బాలికలు

విత్తన శుద్ధిపై రైతులకు అవగాహన

రావికమతం: వివిధ రకాల పంటల్లో తెగుళ్ల సోకకుండా విత్తనాలు ఎలా శుద్ధి చేసుకోవాలో కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ రాజ్ కుమార్, టీవో డాక్టర్ కిషోర్‌కుమార్ పర్యవేక్షణలో వ్యవసాయ కళాశాల విద్యార్థులు మత్స్యవానిపాలెం గ్రామంలో రైతులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రైతులతో సమావేశం ఏర్పాటు చేసి విత్తనాల శుద్ధి వల్ల కలిగే లాభాలు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థినులు ఎ.దివ్య, బి.గీతిక, వి.రాజ్యలక్ష్మి, కె.ఉషారాణి, వి.లావణ్య, రైతులు పాల్గొన్నారు.


మత్స్యవానిపాలెంలో విత్తన శుద్ధిపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ కళాశాల విద్యార్థినులు

జీఎస్టీ తగ్గింపుపై ఈపీడీసీఎల్ ఉద్యోగుల ర్యాలీ

నర్సీపట్నం: జీఎస్టీ తగ్గింపుపై ఏపీఈపీడీసీఎల్ ఉద్యోగులు శనివారం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. డివిజన్ కార్యాలయం నుంచి పెదబొడ్డేపల్లి జంక్షన్ వరకు ఈ ర్యాలీ కొనసాగింది. జంక్షన్లో మానవహారంగా ఏర్పడి సూపర్ జీఎస్టీ-సూపర్ తగ్గింపు అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ అప్పారావు మాట్లాడుతూ విద్యుత్‌తో ముడిపడిన ఎలక్ట్రానిక్స్ ధరలు భారీగా తగ్గాయన్నారు. సోలార్ ప్యానెల్స్ రేట్లు బాగా తగ్గాయన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఏడీఈ త్రినాథరావు, ఏఈ మనోజ్‌కుమార్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


జీఎస్టీపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యుత్ ఉద్యోగులు

ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించాలి


వేచలం పీహెచ్‌సీలో రికార్డులను తనిఖీ చేస్తున్న డీఎం హెచ్‌వో హైమావతి

దేవరాపల్లి: విధి నిర్వహణలో అలసత్వం చూపకుండా ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని వైద్య సిబ్బందికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి హైమావతి సూచించారు. మండలంలోని దేవరాపల్లి, వేచలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆమె శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రెండు పీహెచ్‌సీలలో రికార్డులను పరిశీలించారు. వైద్య సేవలపై ఆయా పీహెచ్‌సీలలో రోగులను అడిగి తెలుసుకున్నారు. మందుల గదిని పరిశీలించి, లభ్యతపై ఆరా తీశారు. వైద్యులు, ఉద్యోగులతో మాట్లాడారు. దేవరాపల్లి, వేచలం పీహెచ్‌సీల వైద్యాధికారులు ప్రశాంత్, శకుంతల, హెల్త్ సూపర్‌వైజర్ పుష్పరాజ్, హెచ్‌వీ నిర్మల, తదితర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ హితం కోసం సైకిల్ వినియోగం


సైకిల్ ర్యాలీలో ఆర్డీవో వి.వి.రమణ, కమిషనర్ సురేంద్ర తదితరులు


రావికమతంలో సైకిల్ ర్యాలీలో పాల్గొన్న మండల స్పెషల్ ఆఫీసర్ సుజాత, తదితరులు

నర్సీపట్నం: వాహన కాలుష్య నివారణ, పర్యావరణ హితం కోసం ప్రతి ఒక్కరు సైకిల్‌ను వినియోగించాలని ఆర్డీవో వి.వి.రమణ కోరారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పురపాలిక శాఖ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని మున్సిపల్ కమిషనర్ సురేంద్రతో కలిసి ఆర్డీవో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలు పెరగటం వల్ల వాయు కాలుష్యం రోజుకురోజుకు పెరుగుతుందన్నారు. స్థానిక అవసరాలకు సైకిల్ వినియోగించటం ద్వారా కాలుష్యంను నియంత్రించిన వారవుతారన్నారు. అనంతరం ఐదు రోడ్ల జంక్షన్ నుంచి ఆర్టీసీ కూడలీ వరకు సైకిల్ ర్యాలీ సాగింది. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రామారావు, టౌన్ ప్లానింగ్ అధికారి సత్యనారాయణ, సిబ్బంది, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

సైక్లింగ్‌తో వాతావరణ కాలుష్య నివారణ

రావికమతం: వివిధ రకాల పనులకు గ్రామాల పరిధిలో సైకిళ్లు ఉపయోగించాలని మండల స్పెషల్ ఆఫీసర్ సుజాత పిలుపునిచ్చారు. స్వచ్ఛాంధ్ర కార్యకమంలో భాగంగా శనివారం ఆమె మండల కేంద్రంలో నిర్వహించిన సైకిల్ ర్యాలీ పాల్గొని, నాలుగు రోడ్ల కూడలీలో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సైక్లింగ్ వల్ల ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మహేష్, డిప్యూటీ ఎంపీడీవో సీతారామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్‌తో మెండుగా ఉపాధి అవకాశాలు

మాకవరపాలెం: పాలిటెక్నిక్ పూర్తి చేసిన విద్యార్థులకు ఉపాధి అవకాశాలు అధికంగా ఉంటాయని విద్యుత్‌శాఖ నర్సీపట్నం డిప్యూటీ ఎద్యుక్యూటివ్ ఇంజినీర్ త్రినాథ్ అన్నారు. తామరం అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం పాలిటెక్నిక్ నూతన విద్యార్థులతో ఇండక్షన్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్యూనికేషన్ స్కిల్‌తో పాటు సాంకేతిక నైపుణ్యంపై పట్టు సాధించాలని సూచించారు. బీఎస్ఎన్ఎల్ ట్రైనింగ్ కోఆర్డినేటర్ భాస్కరరావు మాట్లాడుతూ సమయాన్ని వృథా చేయకుండా విశ్రాంతికి, వినోదానికి సమపాళ్లలో సమయం కేటాయించడం ద్వారా విజయాలను అందిపుచ్చుకోవచ్చన్నారు. నర్సీపట్నం పాలిటెక్నికల్ కళాశాల లెక్చరర్ శర్మ మాట్లాడుతూ లక్ష్య సాధనతో ముందుకు సాగాలన్నారు. వివిధ ఆటల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అవంతి ప్రిన్సిపాల్ మోహన్‌రావు, పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ ప్రసాదరావు, అధ్యాపకులు, ఏవో డానియల్ పాల్గొన్నారు.


ఇండక్షన్ మీట్‌లో మాట్లాడుతున్న డీఈ త్రినాథ్

పంచాయతీల అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకం

చీడికాడ: పంచాయతీల అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకమని ఎంపీడీవో హేమసుందరరావు అన్నారు. పంచాయతీల్లో ఆదాయ వనరులు గుర్తింపుపై సర్పంచ్‌ల రెండు రోజుల శిక్షణా తరగతులు శనివారంతో ముగిశాయి. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఆదాయ వనరులను గుర్తించడంలో సర్పంచ్‌లకు అవగాహన అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు

రావికమతం: రావికమతం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో శనివారం జాతీయ బాలికల దినోత్సవం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ప్రాజెక్ట్ పరిధిలోని రావికమతం, రోలుగుంట, బుచ్చెయ్యపేట, చోడవరం మండలాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో నెల రోజుల పాటు బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. జెడ్పీ హైస్కూళ్లు, కేజీబీవీల్లోని బాలికలకు బాల్య వివాహాలు, లింగ వివక్ష అంశాలపై వ్యాస రచన పోటీలు చేపట్టారు. శనివారం సీడీపీవో మంగతాయారు ఆధ్వర్యంలో నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మహేష్, సీడీపీవో మంగతాయారు, సర్పంచ్ గెంజి మంగ మోదినాయుడు, ఎంపీటీసీ లక్ష్మి నాగేశ్వరరావు, సూపర్‌వైజర్లు రాజరాజేశ్వరి, దాలింబేబీ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.


వ్యాసరచన పోటీల విజేతకు బహుమతి అందజేస్తున్న ఎంపీడీవో, సర్పంచ్, తదితరులు

ఆరు వేల పశువులకు గాలికుంటు టీకాలు

కె.కోటపాడు : కొరువాడ పశువైద్య కేంద్రం పరిధిలోని 15 పంచాయతీలలో ఆరు వేల పశువులకు గాలికుంటు టీకాలు వేసినట్టు పశువైద్యాధికారి సింహాచలం నాయుడు తెలిపారు. కొరువాడలో 34 పశువులకు శనివారం గర్భకోశ చికిత్సలు ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలికుంటు టీకాలను ఈనెల 15 వరకూ లక్ష్యం మేరకు శతశాతం పూర్తి చేశామన్నారు.

బాణసంచా విక్రయాల స్థలం పరిశీలన

రావికమతం: మండలంలో బాణసంచా విక్రయాలు చేపట్టే స్థలాన్ని ఎంపీడీవో మహేష్, డిప్యూటీ ఎంపీడీవో సీతారామస్వామి శనివారం పరిశీలించారు. బాణసంచా వ్యాపారులు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని, లేని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొత్తకోటలో బాణసంచా విక్రయాల కోసం ఐదుగురు వ్యాపారులకు ఆర్డీవో అనుమతులు జారీ చేశారని వారు తెలిపారు.

పేకాడుతున్న ఆరుగురి అరెస్ట్

మాకవరపాలెం: పేకాట స్థావరంపై దాడి చేసి ఆరుగురిని అరెస్ట్ చేసినట్టు ఎస్ఐ దామోదర్‌నాయుడు తెలిపారు. తూటిపాల శివారులో పేకాడుతున్నట్టు అందిన సమాచారంతో శనివారం సిబ్బందితో దాడి చేసి, ఆరుగురిని అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ.3500 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

క్లుప్తంగా

ముగిసిన శిక్షణ తరగతులు



శిక్షణ తరగతులు ముగింపు సభలో సూచనలు చేస్తున్న ఎంపీడీవో శ్రీనివాస్

నాతవరం: శిక్షణ తరగతుల్లో తెలుసుకున్న అంశాలను గ్రామాల్లో అమలు చేయాలని ఎంపీడీవో శ్రీనివాస్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు రెండు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీల్లో చేపట్టే అభివృద్ధి పనులకు ఆర్థిక వనరులు సమకూర్చుట, తదితర విషయాలపై శిక్షణ తరగతుల్లో తెలియజేశామన్నారు. ఇక్కడ తెలుసుకున్న విషయాలను పంచాయతీల్లో అమలు చేస్తేనే ఆశయం నెరవేరుతుందన్నారు. క్షేత్ర స్థాయి సమస్యలపై సభలో సర్పంచులు, కార్యదర్శులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో మూర్తిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

‘సూర్యఘర్’పై అవగాహన ర్యాలీ

మాడుగుల: సూర్యఘర్ పథకంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ మాడుగులలో శనివారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో బస్సు స్టాండ్ ఆవరణలో అధికారులు, కూటమి నాయకులు, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు, ప్రజలతో ఈ ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు నందారపు సన్యాసిరావు, పుప్పాల రమేష్, పుప్పాల లక్ష్మీనారాయణ, ఎంపీడీవో కొంకి అప్పారావు, తహసీల్దారు రమాదేవి, విద్యుత్ శాఖ ఏడీఏ సురేశ్‌కుమార్, ఏఈలు రాంబాబు, సోమరాజు, వెంకట్రావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు ఫ్యాన్ల వితరణ


అంగన్‌వాడీ కార్యకర్తలకు ఫ్యాన్లు అందిస్తున్న సర్పంచ్ గొలగాని రాణీ, తదితరులు

నాతవరం: మండల కేంద్రం నాతవరంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు పంచాయతీ నిధులతో ఫ్యాన్లతో పాటు మౌలిక సదుపాయాలకు సంబంధించిన సామగ్రిని శనివారం నాతవరం సర్పంచ్ గొలగాని రాణి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మేధావుల సంఘం మండల శాఖ అధ్యక్షుడు పైల పోతురాజు, ఉప సర్పంచ్ కరక అప్పలరాజు, టీడీపీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, తాండవ ప్రాజెక్టు మాజీ చైర్మన్ పారుపల్లి కొండబాబు, మాజీ ఎంపీపీ నేతల విజయకుమార్, నాతవరం పీఏసీఎస్ పర్సన్ ఇంచార్జి అపిరెడ్డి మాణిక్యం, పంచాయతీ కార్యదర్శి లాలం శేషుకుమార్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై కావిళ్లతో నిరసన


కావిళ్లతో నీరు తెచ్చుకుంటూ నిరసన తెలుపుతున్న గొల్లపేట గ్రామస్తులు

రోలుగుంట: తాగునీటి సమస్యపై ఎస్.కొత్తూరు పంచాయతీ శివారు గొల్లపేట గ్రామస్తులు దూర ప్రాంతం నుంచి కావిళ్లతో నీరు తెచ్చుకుంటూ శనివారం సీపీఎం ఆధ్వర్యంలో వినూత్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు కె.గోవిందరావు, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఇ.చిరంజీవి మాట్లాడుతూ 45 కుటుంబాలు ఉన్న ఈ గ్రామంలో ఏర్పాటు చేసిన బోరు నుంచి బురద నీరు వస్తోందని చెప్పారు. జల జీవన్ మిషన్ కింద గత ప్రభుత్వం మంజూరు చేసిన రూ.22 లక్షల నిధులు ఖర్చు చేశారని, రెండు రోజులు నీరొచ్చి ఆగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

లైంగిక వేధింపులు, బాల్యవివాహాలు అరికట్టాలి

రోలుగుంట: లైంగిక వేధింపులు, బాల్య వివాహాలు అరికట్టడంలో ఐసీడీఎస్ శాఖ ఎంతో బాధ్యతగా వ్యవహరిస్తోందని, అందుకు మనం కూడా భాగస్వాములు కావాలని జెడ్పీటీసీ పోతల లక్ష్మీరమణమ్మ అన్నారు. రావికమతం ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోషణోత్సవాలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుచ్చింపేట, రోలుగుంట సెక్టార్ల పరిధిలోని అంగన్‌వాడీ వర్కర్లు పోషకాలు లభించే తినుబండారాలు, పండ్లు, ఆకుకూరల స్టాల్‌ను ప్రదర్శించారు. సూపర్‌వైజర్లు హేమ, ఉన్నీషా బెగం, స్థానిక హైస్కూల్ హెచ్‌ఎం శేషగిరిరావు, మహిళా సంరక్షణ కార్యదర్శి గొల్లు వరలక్ష్మి, ఏఎన్‌ఎం, బాలికలు పాల్గొన్నారు.